తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## 18న శ్రీచెంగాళమ్మకు పుష్పయాగం



సూళ్లూరుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవికి శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని పుష్పయాగం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అమ్మణ్ణికి వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తామన్నారు. నంబూరు మోహన్‌రావు, సులోచనమ్మ దంపతులు, నంబూరు మనోజ్‌సాయి, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని చెప్పారు. భక్తులు ఈ యాగానికి హాజరై అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నారదపుష్కరిణిలో చేపలు మృతి

-పట్టించుకోని అధికారులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త

పవిత్రపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలోని బాబుఅగ్రహారం వద్ద ఉన్న నారదపుష్కరిణిలో నీరు రంగుమారి అందులో ఉన్న చేపలన్నీ మృతిచెందాయని తెలుగుదేశంపార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పుష్కరి ణిలో నీరు రంగుమారి ఉందని అందుకే చేపలు మృతిచెందాయని ఇది దేవస్థానం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే అన్నారు. పుష్కరిణిలో నీరు రంగుమారడానికి కారణం ఏమిటో అధికారులు వెల్లడిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, కిషోర్, మునిరాజనాయుడు, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, నల్లగంగమ్మ ఆలయ ఛైర్మన్ మరియు తెదేపా పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, బిసి నాయకుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, మిన్నల్‌రవి, షాకిరాలీ, జిలానీ, మస్తాన్,అస్మత్, సుబ్బయ్య, లక్ష్మీనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

# చంద్రునికి అత్యంత సమీపంలో చంద్రయాన్-3

- నాలుగో కక్ష్య తగ్గింపు విన్యాసం విజయవంతం - నేడు ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ వేరు

శ్రీహరికోట (తడ), ఆగస్టు 16 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రయాన్-3 ప్రయోగం పూర్తిగా విజయవంతం కావడానికి కేవలం వారంరోజుల వ్యవధి మాత్రమే ఉంది. ప్రస్తుతం చంద్రుని కక్ష్యలో తిరుగుతున్న చంద్రయాన్-3 చంద్రుడికి అత్యంత సమీపంలో చేరింది. బుధవారం ఈ ఉపగ్రహం చంద్రుని చుట్టూ 153 కిలోమీటర్ల దగ్గర దూరం, 163 కిలోమీటర్ల ఎక్కువదూరంలో పరిభ్రమిస్తోంది. ఇది చంద్రునికి అన్ని వైపులా 100 కిలోమీటర్ల దూరంలో పరిభ్రమించడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. గురువారం కీలకమైన ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ వేరు కానుంది. అంటే గతంలోలాగా విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ నుంచి వేరుపడి చంద్రుని వైపు దిగడానికి ఇది అత్యంత కీలకదశ. ల్యాండర్ సాఫ్ట్‌గా చంద్రుని దక్షిణ ధ్రువం వైపు ఈ నెల 23న దిగితే అందులో నుంచి బుల్లి రోవర్ బయటకు వచ్చి 14 రోజుల పాటు చంద్రుని దక్షిణ ధ్రువంపై పరిశోధనలు చేస్తుంది. ఈ సాఫ్ట్ ల్యాండింగ్‌కు ముందు జరిగే కీలక విన్యాసాలను ఇస్రో శాస్త్రవేత్తలు సహజంగానే బెంగళూరుకు సమీపంలోని ఇస్ట్రాక్ కేంద్రం నుంచి వరుసగా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు చంద్రయాన్ వేగాన్ని తగ్గిస్తూ, అవసరమైనప్పుడు ఉపగ్రహంలోని ఇంధనాన్ని మండిస్తూ వివిధ విన్యాసాల తర్వాత చంద్రుడికి దగ్గరగా చేర్చారు. జూలై 14న మన తెలుగు నేల శ్రీహరికోట నుంచి ఎల్‌విఎం3 ఎం4 బాహుబలి రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశించిన చంద్రయాన్-3 నెలరోజులకు పైగా లక్షల కిలోమీటర్లు ప్రయాణించి చంద్రుని వద్దకు చేరుకుంది. దీనితో దేశంలోని వివిధ ఇస్రో కేంద్రాలలో ఉన్న శాస్త్రవేత్తలు, ప్రత్యేకించి శ్రీహరికోట శాస్త్రజ్ఞులు కూడా బుధవారం తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చంద్రయాన్-3 పరిశోధన భారత శాస్త్రవేత్తల నిర్విరామ కృషికి నిదర్శనంగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.






చంద్రునికి మరింత చేరువగా తిరుగుతున్న చంద్రయాన్-3

చంద్రయాన్-3ని మోసుకెళ్లిన బాహుబలి రాకెట్

## బిడ్డకు జన్మనిచ్చి పరారైన మహిళ

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో హృదయ విచారకర ఘటన



ఆసుపత్రిలో పోసుకొన్న పసికందు

చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం హృదయ వికార సంఘటన చోటు చేసుకొంది. గర్భిణీతో వున్న ఓ మహిళ తనకు కడుపు నొప్పిగా వుందని వైద్యం చేయాలని వైద్యుల వద్దకు వచ్చి వార్డులోని బాత్‌రూమ్‌కు వెళ్ళి అక్కడే ఓ బిడ్డను ప్రసవించి ఆసుపత్రి నుండి పరారైంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బంది బిజీగా వున్న సమయంలో కడుపు నొప్పికి మందులు ఇవ్వాలని ఓ మహిళ వచ్చింది. ఆ మహిళను ఆసుపత్రి సిబ్బంది వైద్యం చేయడానికి నీ పేరెంటని ప్రశ్నిస్తే అఖిల అని పేర్కొన్నది. అంతే ఇంతలో తనకు కడుపు నొప్పి తీవ్రంగా వుందని బాత్‌రూమ్‌కు వెళ్ళి వస్తానని చెప్పడంతో సిబ్బంది సరే అన్నారు. బాత్ రూమ్‌కు వెళ్ళిన ఆ మహిళ మళ్ళీ ఎంత సేపటికి రాకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది ఆ విషయంను మరచిపోయారు. ఈ క్రమంలో బాత్‌రూమ్‌ను క్లీన్ చేయడానికి వెళ్ళిన కాంట్రాక్ట్ కార్మికులు బాత్‌రూమ్‌ను బకెట్‌తో నీళ్ళు పోయడంతో నీటి చల్లదనం పుట్టిన పసికందుకు తగలడంతో ఆ పసికందు నోటి నుండి కేర్ కేర్ అనే కేకలు విన్పించాయి. ఈ పరిస్థితుల్లో బాత్‌రూమ్ క్లీన్ చెయ్యడానికి వెళ్ళిన సిబ్బంది బాత్ రూమ్ బకెట్ వెనుక ప్రసవించిన బిడ్డ కన్పించడంతో ఈ విషయంను వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన వైద్యాధికారులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి పుట్టిన పసికందును పసి పిల్లల వార్డులోకి తీసుకెళ్ళి వైద్య సేవలు అందిస్తున్నారు. మహిళ గర్భంతో ప్రసవించడానికి ఆసుపత్రికి వచ్చి ఎవరికి తెలియకుండా ఆసుపత్రిలోని బాత్‌రూమ్‌లో ప్రసవించి అక్కడి నుండి పరారైనట్లు సమాచారం తెలియడంతో ప్రసవించిన బిడ్డను చూడటానికి ఆసుపత్రి పరిసరాల్లో వున్న రోగులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ ఘటనకు సంబంధించి విచారించాలని వైద్యాధికారులు టుటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రసవించిన బిడ్డ క్షేమంగా వుందని ఆసుపత్రి వైద్యాధికారులు పేర్కొన్నారు.

## భక్తులకు సకల సౌకర్యాలు

-ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడాలి
-స్థానిక ఆలయాల సందర్శనలో ఛైర్మన్ భూమన



తిరుమల,ఆగస్టు 16ప్రభాతవార్తప్రతినిధి:

ధార్మికసంస్థ టిటిడి ఆధ్వర్యంలోని స్థానిక ఆలయాలను సందర్శించే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించే దిశగా చూడాలని, ఇందుకు అవసరమైన ప్రణాళికలు అధికారులు రూపొందించాలని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సూచించారు. ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా ఉండాలన్నారు. భక్తులకు స్వామివారి దర్శనం వేళలు, ఆలయాల్లో పూజా విశేషాలను తెలియజేసేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బుధవారం ఉదయం భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలోని స్థానిక ఆలయాలు గోవిందరాజస్వామి, కోదండరామ స్వామి ,కపిలేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు.ఇక్కడ భక్తులకు సౌకర్యాలు, స్వామివారి దర్శనం చేయిస్తున్న క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం ఆయా ఆలయాల గర్భగుడిలోకి చేరుకున్న ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. టిటిడి జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవోలు శాంతి, నాగరత్న ,దేవేంద్రకుమార్‌లు ఆయా ఆలయాల వద్ద దుశ్శాలువలతో సత్కరించారు.

## ప్రచార రథాలతో దేవాలయాలపై యువతకు అవగాహన

మంత్రి కొట్టు సత్యనారాయణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలకు సంబంధించి యువతలో అవగాహన,చైతన్యం కల్గించుటకు ప్రభుత్వం 'ప్రచార మాసోత్సవాలను' నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో ప్రచార రథంకు పూజలు జరిపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ధర్మకర్తల మండలి ఛైర్మేన్ అంజూరు తారక శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పర్యవేక్షణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఒక నాడు పది వేలు కూడా దాటని భక్తులు మూడేళ్ళుగా పాతిక వేలకు పెరిగారన్నారు. ఇక్కడ భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలతో భక్తుల రాక పెరిగిందన్నారు. రాబోవు రోజుల్లో తిరుమలేశుని దర్శనం కన్నా భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు.ఈ సభలో మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో కళలు,కళాకారులను రాజులు పోషించి తమ పరిపాలనా తీరుకు సంబందించి ప్రచారం నిర్వహించే వారన్నారు. నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కళాకారులను ఆదరిస్తున్నారని వారి సేవలను ఉపయోగించుకొనుటకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. నేడు శ్రీకాళహస్తిలో ఇంత మంది కళాకారులతో కార్యక్రమాలను ఏర్పాటు చేయటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.రాష్ట్రంలోని పెద్ద దేవవాలయాలకు సంబంధించిన సమాచారాన్ని భావి తరాలకు అందించుటకు ప్రతి నెల ఒక దేవాలయానికి సంబంధించిన రథాన్ని ప్రచారానికి పంపుతున్నట్లు వివరించారు.శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి శాసనసభ్యులు శివా టు శివారోడ్డును కోరారని అయితే రూ.50కోట్లు కేంద్ర మంత్రి గడ్కారిని ఎంపి గురుమూర్తి ఒప్పించి ఇక్కడి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపిస్తే ఆయన నిధులుమంజూరు చేస్తారని తెలిపారు.శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి ద్రోణ సంస్థతోచర్చించి త్వరలోనే మొదటి దశ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.ఈ సందర్భంగా సభలో ఎంఎల్‌ఏ గుడిమల్లాం ఆలయాభివృద్ధికి అలాగే తొండమాన్‌పురంలో వెంకటేశ్వరస్వామి ఆలయంను అనుసంధానం చేస్తూ ప్రత్యేక ప్యాకేజిగా పర్యాటక శాఖ చర్యలు చేపట్టాలని కోరారు. దేవాదాయశాఖ రూపొందించిన ధర్మప్రచార మోసోత్సవాల కరదీపికను బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయం ఆవరణలో ఆవిష్కరిం చారు. రథాల కార్యక్రమాలను వివరిస్తూ కరదీపకులు ఆవిష్కరించారు. తిరుపతిపార్లమెంటు సభ్యులు మద్దెల గురుమూర్తి, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ,మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ కెవి సాగర్‌బాబు,ఆర్‌డిఓ కెయస్ రామారావు,ఎసి మల్లికార్జున్ ప్రసాద్ డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## 25న అమ్మవారి ఆలయంలో వరలక్ష్మి వ్రతం

నేరుగా, వర్చువల్‌గా పాల్గొనే అవకాశం



తిరుచానూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 25వ తేది శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆస్థానమండపంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ మాడ వీధులలో ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. ఈ వ్రతాన్ని శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనుందన్నారు. భక్తులు నేరుగా పాల్గొనేందుకు ఆగస్టు 18వ తేది ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో 150 టికెట్లు జారీ చేస్తారన్నారు. అదే విధంగా ఆలయం వద్ద గల కుంకుమార్చన కౌంటర్‌లో ఆగస్టు 24వ తేది ఉదయం 9 గంటలకు కరెంట్ బుకింగ్‌లో 150 టికెట్లు విక్రయిస్తారు. రూ. 1000 చెల్లించి భక్తులు టికెట్ కొనుగోలు చేయవచ్చునని ఒక టికెట్‌పై ఇద్దరు గృహస్తులను అనుమతిస్తారన్నారు. శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యేక ప్రసారం ద్వారా వర్చువల్ విధానంలో భక్తులు పాల్గొనేందుకు వీలుగా ఆగస్టు 18న ఉదయం 9 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో టికెట్లను విడుదల చేయనుందని వర్చువల్ టికెట్లు పొందిన భక్తులకు ఆగస్టు 26నుండి 90 రోజుల లోపు అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారన్నారు.

## మంత్రి వచ్చినా దుకాణాలు మూయాల్సిందే



శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త

ఇక రాబోవు రోజుల్లో ఏ శాఖ మంత్రి వచ్చినా ఆయన సభలు నిర్వహించే చుట్టుపక్కల, పరిసరాల్లో దుకాణాలు మూసివేయాల్సిందేనా? అనే విమర్శలు చోటు చేసుకున్నాయి.బుధవారం రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణచే ప్రచార రథాలు మాసోత్సవాలను ప్రారంభించుటకు వచ్చారు. మంత్రి పదవి చేపట్టిన తరువాత కొట్టు సత్యనారాయణ ఒక సారి రాగా భక్తులకు ఇబ్బంది కల్గించారు. జనం తిరగబడ్డారు.దాంతో బుధవారం కొట్టు సత్యనారాయణ రాక సందర్భంగా అధికారులు అత్యూత్సాహం చూపారు. మంత్రి సభను ఓం కార మండపం వద్ద సాంస్కృతిక వేదికపై ఏర్పాటు చేసారు.ఈ సభకు భక్తులు రాకపోగా కళాకారుల బృందాలు,చిన్నారులతో నిర్వహించారు. ఎప్పుడూ రద్దీగా ఉండే నాల్గవ గేటు నుంచి ప్రవేశాలను నిషేధించారు.సన్నిధి వీధి, నాల్గవ గేటు పరిసరాల్లో కర్ఫ్యూ విధించినట్లు మార్చారు.ఈ మార్గంలో భక్తులను చివరకు విఐపిలను ఐకూడా రాకుండా చర్యలు తీసుకున్నారు.అంతేకాదు. ఇక్కడ ఉన్న వందల దుకాణాలను కూడా మూయించారు.దాంతో మంత్రి ప్రసంగం కేవలం చిన్నారులైన కళాకారులకే పరిమితమైంది.

**లక్షలు వెచ్చించి . . .**

గతంలో ఏ మంత్రికి లేని విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధిత మంత్రి వచ్చారు. ఆయన రాక సందర్భంగా లక్షలకు లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాట్లు చేసారు. ఆలయానికి సుందరంగా ముస్తాబుచేసారు. భారీ ఎత్తున ప్లేక్సీలు ఏర్పాటు చేసారు.కానీ జనం లేకుండా వెల వెల బోయింది.మంత్రి కార్యక్రమాలకు ఎందుకు హంగామా చేసారు?అనేది చర్చనీయాంశంగా మారింది.

## సమర యోధుల త్యాగాలను స్మరించుకుందాం

మంత్రి రోజా



నగరి, ఆగస్టు 16 ప్రభాతవార్త:

తర తరాలుగా పడిన యాతన తీర్చి, బానిస సంకెళ్ళ నుంచి విముక్తి ప్రసాదించిన వరదాతలైన త్యాగమూర్తులను స్మరించుకుందామని మంత్రి రోజా పేర్కొన్నారు. బుధవారం నగరి పట్టణ పరిధిలోని డా. వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన నా మట్టి..నా దేశం కార్యక్రమానికి మంత్రి, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటి పతాకావిష్కరణ చేశారు. అందరిచేత ఈ దేశాన్ని గౌరవిస్తాం ఈ దేశాన్ని రక్షిస్తాం ఈ దేశాన్ని అభివృద్ధి చేయడంలో మేమందరం భాగస్వాములు అవుతాం అంటూ మట్టి చేతులతో ప్రమాణం చేయించారు. ప్రమాణం చేసిన అనంతరం మట్టిని కుండల్లో సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య వెనుక ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలం ఉందన్నారు. వారి ప్రాణత్యాగం నేడు మనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చిందన్నారు. అలాంటి త్యాగమూర్తులను స్మరించుకుని వారి రుణం తీర్చుకోవడంతో పాటు వారి కీర్తిని భావితరాల వారికి తెలియచెప్పాలన్నారు. అందుకే వారికి గుర్తుగా మొక్కలు నాటుతూ శిలాఫలకాలను ప్రారంభించడం జరుగుతోందన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి సేకరించిన మట్టిని ఢిల్లీ వరకు చేరుతుందన్నారు. ప్రధాన మంత్రి మోదీ అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన మట్టితో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ స్మారక స్తూపాన్ని కట్టి జాతికి అంకితం ఇవ్వనున్నారన్నారు. . జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ మనకు స్వాతంత్ర్యం సాధించడంలో పాటు పడిన ఎందరో సమరయోధుల త్యాగ నిరతితో పాటు స్వాతంత్ర్యం ఎంత విలువైందో భావితరాలకు చెప్పేందుకు నా మట్టి... నాదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సృజన, మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ డీఈ నరేష్, హౌసింగ్ డీఈ శంకరప్ప, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రసాద్, సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు, మహిళా సమాఖ్య సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య 4లో

## టిటిడి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి ఆశీస్సులు అందుకున్న తుడ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, ఆగస్టు16 ప్రభాతవార్త:

టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకరెడ్డి ఆశీస్సులను తుడ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందుకున్నారు. బుధవారం పద్మావతిపురంలో టిటిడి ఛైర్మన్ నివాసంలో భూమన కరుణాకర్ రెడ్డిని ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి, పాదాభివందనం చేసి, ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం టిటిడి ఛైర్మెన్ దుశ్శాలువతో సన్మానించి, మొక్కను అందజేసారు.

# తలదాచుకునే చోటేది గోవిందా..?



తిరుచానూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త

కొండంత భక్తితో స్వస్థలాల నుంచి వందల కిలో మీటర్ల కొద్ది నడుచుకుని వస్తున్న మా మొర ఆలకించు స్వామి.. గోవిందా.. అంటూ ఏడుకొండల వాడి భక్తులు వాపోతున్నారు. తిరుచానూరులో కాలినడక భక్తులు తల దాచుకునేందుకు కనీసం విశ్రాంతి భవనాలు లేవు.. రోడ్ల పై రక్షణగా ఫుట్ పాత్ ఏర్పాటు చెయలేదు.. సామాన్య భక్తులకు పెద్దపీట అని పదే పదే చెబుతున్న అధికారులకు కాలినడక భక్తుల కష్టాలు పట్టవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రం తిరుమలకు నిత్యం వేలాది మంది భక్తులు స్వామి వారి మొక్కులు తీర్చుకునేందుకు కాలి నడకన వస్తుంటారు. మరీ ముఖ్యంగా తమిళ భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భజన బృందాలుగా వస్తుంటారు. ఈ క్రమంలో నగరి, పుత్తూరు, వడమాలపేట, పూడి మీదుగా తిరుచానూరుకు వచ్చే భక్తులకు అక్కడక్కడ విశ్రాంతి తీసుకునేందుకు మండపాలు ఏర్పాటు చేసి ఉన్నారు. అయితే తిరుచానూరులో మాత్రం వీరి కోసం ఎలాంటి వసతి సదుపాయాలు లేవు. భక్తులు సేద తీరడానికి ప్రైవేటు కళ్యాణ మండపాలలో అధిక మొత్తంలో అద్దె చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ధార్మిక కార్యక్రమాలకు దేశ, విదేశాల్లో కోట్లకు కోట్లు ఖర్చు చేస్తున్న టిటిడి సొంత ఇంట్లో సమస్యపై దృష్టి పెట్టలేక పోతోందనే విమర్శలు వినబడుతున్నాయి. ఈ తరుణంలో టిటిడి కాలినడకన భక్తుల కోసం విశ్రాంతి భవనం నిర్మిస్తే అటు కాలినడక భక్తులకు, ఇటు అమ్మవారి భక్తులకు కూడా ఎన్నో ఇక్కట్లు తప్పి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. తిరుచానూరు నుంచి అలిపరివరకు ఫుట్‌పాత్ ఏర్పాటు చేయవల్సిన అవసరంఉందనేది అక్షర సత్యం.

**అమ్మవారి చెంత కాలినడక భక్తుల చింత..**
**నడకదారి భక్తుల ప్రాణాలకు భద్రత కరువు..**

**ప్రాణాలొదిలిన భక్తులెందరో..**

స్వామి వారిపై భక్తి విశ్వాసాలతో వందల కిలోమీటర్లు పాదయాత్రగా వస్తూ దురదృష్టవశాత్తు ప్రాణాలొదిలిన భక్తులెందరో ఉన్నారు. ఆ స్వామి వారి దివ్య మంగళ రూపాన్ని క్షణికాలం చూసి తరిస్తే చాలని వస్తున్న భక్తులను అసౌకర్యాలు కబలిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారనం భక్తులు విశ్రాంతి తీసుకోవడానికి సరైన షెల్టర్లు లేకపోవడం.. ఫుట్ పాత్‌లు ఏర్పాటు చేయకపోవడమేనని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుని వెళ్ళడం ఆనవాయితీగా వస్తోంది. తిరుచానూరు నుంచి అలిపిరి వరకు ప్రత్యేకంగా నడిచి వెళ్ళే భక్తులకు ఫుట్ పాత్ ఏర్పాటు చేస్తే భక్తులకు భద్రతతో పాటు సౌకర్యవంతంగా ఉంటుందనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది. తాజాగా తిరుచానూరు పై ఓవర్ వద్ద రోడ్డు, కాలువ పనులు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో పనిలో పనిగా ఫుట్ పాత్ కూడా ఏర్పాటు చేస్తే ఖర్చు కూడా తగ్గుతుంది. టిటిడితో పాటు నగర పాలక సంస్థ అనుసంధానంగా నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ త్వరలోప్రారంభం కానున్న నేపథ్యంలో నడిచి వెళ్ళే భక్తులకు కూడా ఒక వైపు మార్గం ఉంటే సులభంగా వెళ్ళేందుకు అవకాశం ఉందని టిటిడి ఉన్నతాధికారులు గుర్తించి ఈ దిశగా అడుగులు వేస్తే బాగుంటుందనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది.

## 25న నగరికి సిఎం వైఎస్ జగన్

- సమన్వయంతో సిఎం పర్యటన విజయవంతం చేయాలని జెసి ఆదేశం

చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 25న నగరికి రానున్నారు. నగరిలో జరిగే రాష్ట్ర స్థాయి జగనన్న విద్యాదీవెన కార్యక్రమానికి సిఎం వైఎస్ హాజరుకానున్నారు. ఈ మేరకు అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి విజవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో జెసి పి.శ్రీనివాసులు బుధవారం సిఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లపై ఎస్పీ సుధాకర్, డిఆర్ఓ రాజశేఖర్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తుల సీ, మెప్మా పిడి రాధామ్మ, హౌసింగ్ పిడి పద్మనాభం, డ్వామా పిడి గంగాభవానీ, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిఇఓ విజయేంద్రరావు, జిల్లా బిసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ భాషా, సాంఘీక సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్రనాథ్‌రెడ్డి, డిటిసి నిరంజన్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఇఇ హరి, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, జిల్లా ప్రణాళిక అధికారి ఉమాదేవి, ఇన్‌ఛార్జి డిడి పద్మజ, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు

- నేటిలోపు నిత్యవసరవస్తువుల పంపిణీ పూర్తి
- 22ఎ భూముల వివరాలు సత్వరం పంపాలి
- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:

ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులను పారదర్శకంగా చేపట్టి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో బుధవారం జెసి పి.శ్రీనివాసులు జిల్లా స్థాయి అధికారులతో సమావేశమై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో జెసి మాట్లాడుతూ ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమంను గురువారం సాయంత్రంలోపు పూర్తి చేయాలన్నారు. అలాగే ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి నిర్ణయించుకొన్న లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి జిల్లాలో 3,110 మందికి 3,581 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని, ఈ కార్యక్రమంను సత్వరం పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. భూముల రీ-సర్వేకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయం మేరకు మొదటి దశ పూర్తి అయ్యిందని, మొదటి దశలో సర్వే రాళ్ళు నాటే కార్యక్రమంను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అలాగే రెండవ దశకు సంబంధించి క్షేత్ర స్థాయి పనులను వేగవంతం చేసి 13 నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఎడి గౌస్‌భాషా, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, డ్వామా పిడి గంగాభవానీ, హౌసింగ్ పిడి పద్మనాభం, డిఇఓ విజయేంద్రరావు, ఎస్ఎస్ఎ పిఓ వెంకటరమణారెడ్డి, డిఎల్‌డిఎ రవికుమార్‌లు పాల్గొనగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఓలు, తహసిల్దార్లు మండలాల నుండి హాజరయ్యారు.

## పాత్రికేయుడు సోమరాంరెడ్డి మృతి

రామకుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త



రామకుప్పం మండలం బగళనత్తంకు చెందిన పాత్రికేయుడు సోమరా ంరెడ్డి బుధవారం రాత్రి మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవారు. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి మృతి చెందారు. సోమరాంరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీలు భరత్, డా॥ కంచర్ల శ్రీకాంత్‌లు తమవంతు సాయంగా చెరో పదివేల వంతున బాధిత కుటుంబంకు సాయం అందించారు. ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం , జడ్పీటిసి నితిన్‌రెడ్డి, స్థానిక నేతలు పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. పాత్రికేయుడు సోమరాంరెడ్డి మృతి పట్ల కుప్పం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్ఎం రాజు, ప్రధాన కార్యదర్శి అస్గర్, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## అక్రమంగా చెట్లకూల్చివేత.. పట్టించుకోని అధికారులు

శాంతిపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండలంలోని రాళ్లబూదుగూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దశాబ్దాల నాటి వృక్షాలను తొలగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెదేపా నేతలు మణి, చంద్ర, సుగుణమ్మ పేర్కొన్నారు. కొంతమంది లేఔట్ వేసే నిమిత్తం రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించి భూమిని చదును చేస్తున్నారన్నారు. బహిరంగంగా రోడ్డు పక్కనే చెట్లను కూల్చడం, విచ్చలవిడిగా చిన్నారిదొడ్డి పంచాయతీలోని చెంచప్ప చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించి చదును చేస్తున్నారన్నారు. అధికారులు ఈ వ్యవహారంపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇంటింటికి థామస్ కార్యక్రమం విజయవంతంకు కృషి

పాలసముద్రం, ఆగస్టు 16 ప్రభాతవార్త:



జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ పాలసముద్రం మండలంలో నిర్వహించనున్న ఇంటింటికి థామస్ కార్యక్రమం విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర తెలుగుదేశం ప్రభావశీల గుర్తింపు కమిటీ సభ్యుడు చిట్టిబాబు పిలుపునిచ్చారు. పాలసముద్రం మండల దేశం కార్యాలయంలో బుధవారం చిట్టిబాబు అధ్యక్షతన నరసింహాపురం, తిరుమలరాజపురం, గంగమాంబపురం, కోదండరామాపురం పంచాయతీ తెలుగుదేశం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని ప్రతి ఇంటి వద్దకు తీసుకెళ్ళాలని నిర్ణయించి ఈ పంచాయతీల్లోని ప్రతి ఇంటి గడప వద్దకు వెళ్ళి పలకరించాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ థామస్ నిర్ణయించారని ఈ మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు సాంబశివన్, పయణి, ఎలుమలై, నాలుగు పంచాయతీల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశరాజధాని ఢిల్లీకి కుప్పం మట్టి కలశాలు

కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త



మేరీ మిట్టి - మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కుప్పం మండలం లో వివిధ ప్రాంతాలనుంచి సేకరించిన మట్టిని కలశాలలో నింపి దేశ రాజధాని న్యూఢిల్లీకి పంపిస్తున్నట్లు ఎంపిపి అశ్విని మురుగేష్ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో మట్టి సేకరించిన కలశాలకు పూజలు నిర్వహించారు. కుప్పం మండలంలోని అన్ని పంచాయతీలనుంచి మట్టిని సేకరించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, ఎంపిడిఒ జానకమ్మ, ఇఓపిఆర్డి విజయదత్, సర్పంచులు కుమారస్వామి, రామచంద్ర, కార్యదర్శులు రేణుక, శ్రీలక్ష్మి, మురళికృష్ణ, భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ కత్తి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఒ జానకమ్మకు ఉత్తమ సేవా ప్రశంసాపత్రం

కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త



కుప్పం ఎంపిడిఒ జానకమ్మకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భం గా ఉత్తమ సేవా ప్రశంసాపత్రం లభించింది. విధి నిర్వహణలో చూపిన ప్రతిభను గుర్తించి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీచైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు. కుప్పం మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మరింత కృషి చేస్తానని పురస్కారం రావడం తనపై మరింత బాధ్యత పెంచిందని ఎంపిడిఒ తెలిపారు. కాగా బుధవారం ఎంపిడిఒ జానకమ్మను ఎపిఒ హరినాథ్, ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్లు ఘనంగా సత్కరించారు.

## చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనే ధ్యేయం

- చంద్రబాబు కార్యదర్శి మనోహర్

కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు ఈసారి ఎన్నికల్లో కుప్పంలో లక్ష ఓట్ల మెజార్టీ సాధనే తమ ధ్యేయమని చంద్రబాబు కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం మున్సిపల్ పరిధి కుర్మపల్లెలో తెలుగుయువత సైకిల్ యాత్రను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో చంద్రబాబు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు, మహాశక్తి పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. సైకిల్ యాత్రకు ప్రజలనుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కాగా షాహీ గార్మెంట్ మహిళా కార్మికులు సైతం అధిక సంఖ్యలో సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కోఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్, తెలుగుయువత రాష్ట్ర నేత మణి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, మంజునాథ్, డికెపల్లి మణి,కనకరాజ్,సురేష్, నాగేంద్ర, కౌన్సిలర్లు సోమశేఖర్, సెల్వరాజ్, వేలు, డికెపల్లి ఇన్‌ఛార్జ్ నబీఖాన్, టిఎన్ఎస్ఎఫ్ మునెప్ప, మహిళా అధ్యక్షురాలువసంతమ్మ,తిరుమగళ్,తెలుగుయువతనేతలుబాబు,సుబ్బు,లక్ష్మీపతి,విశ్వనాథ్, సుబ్రమణ్యం, శంకర్ చంద, రామాంజులు, మంజు, అశోక్, వేణు,పిఎస్ సతీష్, గిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ పనులు అడ్డుకుంటున్నారని గ్రామస్తుల ఫిర్యాదు

కుప్పంరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త



మండలంలోని కృష్ణదాసనపల్లి గ్రామంలో డ్రైనేజ్ కాలువ నిర్మాణ పనులను గ్రామానికి చెందిన ఓ మహిళ అడ్డుకుం టోందని గ్రామస్తులు బుధవారం ఎంపిడిఒ జానకమ్మ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కెడిపల్లి - యానాది పల్లి మార్గంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణం ప్రభుత్వం చర్యలు చేపడితే చిన్నగంగమ్మ అనే మహిళ గొడవకు దిగుతోందని పనులు అడ్డుకుంటోందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి కాలనీలో డ్రైనేజ్ సమస్య పరిష్కరించాలని కోరారు.

## హైనా దాడిలో ఆవు మృతి

రామకుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండలంలోని పంద్యాలమడుగులో బుధవారం ఉదయం హైనా దాడిలో ఓ పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన సోమిరెడ్డికి చెందిన పాడి ఆవు తీవ్రగాయాలతో మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. అయితే ఆవును హైనా దాడిచేసి చంపిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు సంఘటనా స్థలిని పరిశీలించి ఆవును హతమార్చింది హైనా అని నిర్ధారించారు.

## తెదేపా సీనియర్ నేత మృతి.. చంద్రబాబు సంతాపం

రామకుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త

రామకుప్పం మండలం మిట్టపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత రమేష్ బుధవారం మృతి చెందారు. ఈయన అకాల మృతి పట్ల తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రమేష్ ఆత్మకు శాంతి కలగాలని ఈ విషాదం నుంచి వారి కుటుంబం త్వరగా కోలుకునేలా మనోధైర్యంను భగవంతుడు ప్రసాదించాలని సంతాపం వ్యక్తం చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, ఆగస్టు 16 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు బుధవారం రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన ధనూష్‌రెడ్డి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు ఆన్‌లైన్ ద్వారా లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు

తవణంపల్లె, ఆగస్టు 16 ప్రభాతవార్త:



పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. బుధవారం మండలంలోని సరకల్లు గ్రామ సచివాలయ పరిధిలోని సరకల్లు ఎస్సీవాడ, అరుందతివాడ, ఎస్.కృష్ణాపురం గ్రామాలలో ఎమ్మెల్యే బాబు ప్రజా సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈసందర్భంగా సరకల్లు అంగన్‌వాడీ కేంద్రంతో కార్యకర్తలకు యూనిఫాంను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, ఉపాధి ఏపీఓ లలిత, వెలుగు ఏపీఎం రవి, ఏఓ ప్రవీణ్, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, సీడీపీఓ నిర్మల, మండల వైకాపా కన్వీనర్ సిద్దపంల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, జయప్రకాష్‌రెడ్డిలతో పాటుపలువురుప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేపటి నుండి సామూహిక సంకల్పధ్యాన మహా యజ్ఞం

తవణంపల్లె, ఆగస్టు 16 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ-చిత్తూరు రహదారిలోని సిద్దపంల్లె వద్ద వెలసిన శ్రీవిఘ్నేశ్వర పిరమిడ్ శక్తి క్షేత్రం నందు ఈనెల 18 నుండి 11 రోజుల పాటు సామూహిక సంకల్పధ్యాన మహా యజ్ఞం జరుగుతుందని చిత్తూరు జిల్లా పిరమిడ్ సొసైటీ మరియు గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈసందర్భంగా ప్రతి రోజూ సీనియర్ పిరమిడ్ మాస్టర్‌లచే ఆత్మజ్ఞాన సందేశాలు, లైవ్ మ్యూజిక్ మెడిటేషన్, ఆధ్యాత్మిక సదస్సులు జరుగుతాయని తెలిపారు.ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

## విధుల్లో జాగ్రత్త.. లేకుంటే ఉద్యోగాలు పోతాయ్ - ఆర్డీఓ శివయ్య

కుప్పంరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త



బూత్ లెవెల్ అధికారులు విధుల్లో జాగ్రత్తగా ఉండాలని లేకుంటే ఉద్యోగాలు పోతాయని ఆర్డీఓ శివయ్య హెచ్చరించారు. బుధవారం కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా పరిశీలనపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా పరిశీలనలో నిర్లక్ష్యంగా వహించిన ఎనిమిది బిఎల్‌ఓలకు ఇదివరకే షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. నిర్ణీత గడువులోగా బిఎల్‌ఓలు ఓటర్ల పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా బిఎల్‌ఓలు నిష్పక్షపాతంగా వ్యవహరించి జాబితాలను రూపొందించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపొందించిన అనంతరం అన్ని రాజకీయపార్టీలకు అందించి అభ్యంతరాలు తెలుసుకుని ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కాగా రామకుప్పం మండలంలో పంచాయతీ వార్డు ఎన్నికలకు గాను తెదేపా మద్దతుదారులు వేసిన నామినేషన్ల తిరస్కరణపై చంద్రబాబు కార్యదర్శి మనోహర్ ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. సమావేశంలో తహశీల్దార్ పార్వతి, నేతలు త్రిలోక్, మురుగేష్, శివశంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఉత్తమ అవార్డు అందుకున్న ఎస్ఐ వీరనారాయణ

బాలాయపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త:



విధులు సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎస్ఐ వీరనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డును ప్రధానం చేసింది. డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చేతుల మీదుగా ఎస్ఐ ఉత్తమ అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి సమక్షంలో అవార్డును అందుకున్నారు. అవార్డు రావడం ఆనందంగా ఉందని ఎస్ఐ తెలిపారు. తనకు భాధ్యత మరింత పెంచిందన్నారు.

## ఎంపిడిఓ గోపినాథ్‌కు ఐదవసారి అవార్డు

వాకాడు, ఆగస్టు 16, ప్రభాతవార్త



వాకాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న టి. గోపినాద్‌కు వాకాడు మండలంలోనే వరుసగా ఐదవ సారి పురస్కారం తీసుకోవడం జరిగిందని ఎంపిడిఓ గోపినాథ్ అన్నారు. బుధవారం వాకాడు మండల పరిషత్ కార్యాలయంలోని ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం తిరుపతిలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ వెంకట్ రమణారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఎంపిడిఓ పురస్కారం తీసుకోవడం జరిగిందని ఆయన సంతోషం వ్యక్తపరిచారు. గతంలో ఎన్నోసార్లు ఈ పురస్కారం అనేక సార్లు వివిధ రకాలుగా అందుకున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పదములో జిల్లా స్థాయిలోనే వాకాడు మండలంను ముందంజలో ఉండేందుకు తగు చర్యలు తీసుకోవడం, అన్ని రంగాలలో అంకితభావంతో సేవ భావంతో పనిచేస్తూ, మండలంలోని ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది తగు సూచనలు సలహాలు ఇస్తూ చూసుకుంటున్నానన్నారు. మండల స్థాయిలో, డివిజన్ స్థాయిలో, జిల్లా స్థాయిలో అవార్డులు అందుకున్నానని, రాష్ట్ర ముఖ్యమంత్రి పురస్కారం మిగిలి ఉందని అన్నారు. వాకాడు సొసైటీ చైర్మన్ దామోదర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు అజిత్ కుమార్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు విజయ్ భాస్కర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, మండల ప్రజలు, ఎంపిడిఓ గోపినాథ్‌కు అభినందనలు తెలిపారు.

## తిరుమూరులోని జగనన్న లే అవుట్‌లో బందెలదొడ్డి

వాకాడు, ఆగస్టు 16, ప్రభాతవార్త



మండలంలోని తిరుమూరు పంచాయితీ జగనన్న లే అవుట్లు అపరిశుభ్రంగా ఉండడంతో గ్రామస్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని తిరుమూరు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమూరు గ్రామస్థులు ప్రకటన ద్వారా తెలియజేస్తూ జిల్లా గ్రీవెన్స్‌ల కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశానమన్నారు. లే అవుట్‌లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడుతుంటే గ్రామంలో మరికొందరు పశువులను ఇళ్ళ నిర్మాణాల పక్కనే కట్టి పేడ దిబ్బలను పోయడంతో దుర్గంధమైన వాసనతో పాటు గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఇటీవల కాలంలో సుమారు 60 మంది పైగానే గ్రామస్తులు డెంగ్యూ బారిన పడి ఆసుపత్రుల పాలయ్యారు. కొందరు స్థలాలను కబ్జా చేసి షెడ్డులను కూడా నిర్మించి ఉన్నారు. మరోపక్క కొందరేమో గడ్డివాములు వేశారన్నారు. మండల అధికారుల దృష్టికి పలుమార్లు సమస్యను తెలిపిన పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తిరుమూరు గ్రామంలో లేఔట్‌లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇకనైనా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయనను కోరామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వంజవాక రాగయ్య, పాముల సుబ్రమణ్యం, పామంజి అశ్విని కుమార్ తదితరులు ఉన్నారు.

## తడలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం

తడ, ఆగస్టు 16 ప్రభాతవార్త

తడ ప్రాంతంలో చాలారోజుల తర్వాత బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. అయితే ఉరుములు మెరుపులు తీరప్రాంత ప్రజలను భయపెట్టాయి. ఆగకుండా గంటసేపు కురిసిన వర్షం వల్ల పలుచోట్ల వాతావరణం చల్లబడటంతో పాటు వ్యవసాయ సీజన్‌కు ఇది ఎంతో ఉపయోగపడినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం కోత దశలో ఉన్న వరి పంటకు మాత్రం ఈ వర్షం వల్ల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. తడ మండలంలోని పాములకాలువ సమీప గ్రామాల్లో పంటలు కోసుకుంటున్న రైతులు ఈ వర్షంతో కొంత నష్టపోయినట్లు తెలిపారు. బుధవారం ఇక్కడ 50.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## వెంకటగిరి సాహెబ్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త



వెంకటగిరి సాహెబ్ ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వంతో జరుగుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సమన్వయ సేవాసమితి ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం సమన్వయ సేవాసమితి ఆధ్వర్యంలో వెంకటగిరి సాహెబ్ ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా మైనార్టీసెల్ కార్యదర్శి, కోట బిట్-2 ఎంపిటిసి షేక్ మొబిన్‌బాషా వందమంది పేదలకు అన్నదానం, 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కోట ఎంపిటిసి మొబిన్‌బాషాను సేవాసమితి స్వచ్ఛంధ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మొబిన్‌బాషా మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమన్వయ సేవాసమితి ప్రతినిధులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. వెంకటగిరి సాహెబ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా ఉచితంగా ఖత్నాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు రమణమ్మ, షేక్ షంషద్, లక్ష్మమ్మ, గౌరమ్మ, ట్రస్టు ప్రతినిధులు అఖిల్, నదిమ్, మొహిన్, ఇలియాజ్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ అమిర్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిఆర్ జన్మదిన వేడుకలు

కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త



వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొడవలూ రు ధనంజయరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధనంజయరెడ్డిని పలువురు వైసీపీ అభిమానులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. ధనంజయరెడ్డి కోట మండలంలో సొంత నిధుల తో తాగునీరు, సాగునీరు అందించి రైతు బాంధవుడిగా నిలిచారని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో ఎన్నో దేవాలయాలు నిర్మించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు దాసరి కోటయ్య, చేవూరు నాగేశ్వరరావు, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ పుట్టా నారాయణ, గోనుపల్లి మస్తాన్, ముంగమూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వాజ్‌పాయ్ సేవలు అపారం

కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త



దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పాయ్ దేశానికి అందించిన సేవలు అపారమని కోట మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు అన్నారు. బుధవారం వాజ్‌పాయ్ 5వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బిజెపి కార్యాలయాలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సారంగం రమేష్‌బాబు మాట్లాడుతూ దేశంలో ఆరులైన్ల రహదారులతో పాటు గ్రామీణ సడక్ యోజన కింద సిసి రోడ్లు వేసిన ఘనత వాజ్‌పాయ్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అంబరీష్, గురుదేవయ్య, యువమోర్చా అధ్యక్షులు పరశురామ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలి

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం నాయుడుపేట మండలం మేనకూరు సచివాలయం పరిధిలోని వద్దిగుంటకండ్రిగ, ఎర్రపశెట్టిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవయ్య పాల్గొన్నారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలకు బుక్‌లెట్లు అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజలు మంచి చేస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, ఎంపిపి ధనలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్ బట్టూరు కిషోర్ యాదవ్, నాయకులు కట్టా భవానిశంకర్‌రెడ్డి, పాదర్తి హరినాథరెడ్డి, పేర్నాటి రాహుల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

నాయుడుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త



నాయుడుపేటలోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న భగవతి శ్రీమల్లికాంబఆలయంలోచెన్నైశంకర్ నేత్రాలయ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమాస రామనారాయణ మాట్లాడుతూ భగవంతిశ్రీమల్లికాంబఆలయంతరపున పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారంచుట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఉచిత కంటి, దంత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని, సుమారు 40 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

## హరిప్రియ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

గూడూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో, హరిప్రియ దంత వైద్యశాల వారు ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు హరిప్రియ దంత వైద్యశాల వారు ఉచిత దంత వైద్యం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్య భద్రత కింద ప్రతి పోలీసు దాదాపు రూ.30 వేలు చెల్లిస్తారని, ఈ హరిప్రియ దంత వైద్యశాల వారికి ఇలా వైద్యశిబిరం పెట్టుకునేందుకు అనుమతి ఉందన్నారు. అనంతరం హరిప్రియ దంత వైద్యశాల వారు పోలీసులకు మెడికల్ కిట్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ సిఐ దశరథరామారావు, టూ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది, హరిప్రియ వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరికం లేని సమాజ నిర్మాణమే టిడిపి లక్ష్యం

- మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, ఆగస్టు 16 ప్రభాతవార్త



రాష్ట్రంలో పులికేసి పాలన సాగుతోందని, జగన్‌రెడ్డి పాపాలు పండాయని సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయని, వైసీపీ గూండా రాజ్యం ఇంకెన్నాళ్లో సాగదని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అరాచకాలకు చరమగీతం పాడే సమయం దగ్గరలోనే ఉందన్నారు. ప్రజల బాగోగులు వదిలేసి అవినీతి అక్రమాలకు దృష్టి పెట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. ఓజిలి మండలం రావిపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం దిగ్విజయంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొనగా, ఆయనకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో దళారీ వ్యవస్థ నడుస్తోందని, సామాన్యులు బతికే పరిస్థితి ఈ ప్రభుత్వం కల్పించలేకపోయిందని విమర్శించారు. నిత్యావసర సరుకుల నుంచి ప్రతి వస్తువుకు ముక్కుపిండి అధిక ధరలను ఈ ప్రభుత్వం వసూలు చేస్తోందని ఆరోపించారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు మహిళల గురించి ప్రత్యేకంగా ఆలోచించి మహాశక్తి రథం కార్యక్రమం ద్వారా మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, పాడి వెంకటసుబ్బయ్య, పురుషోత్తంరాజు, కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, కిరణ్‌నాయుడు, భాస్కర్ గౌడ్, నరేష్, నట్టి వినోద్‌కుమార్, రాజేష్, కిషోర్‌రాజు, తాళ్లూరు బాబునాయుడు, ఉపాధ్యక్షురాలు రుద్రరాజు ప్రసన్న, మల్లికార్జునరావు, పరంధామరాజు, మాజీ సర్పంచ్ పొన్నగంటి సుబ్బరాయులు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆసలే ఆంధ్ర మద్యం.. అందులో వెంకటగిరిలో భారీగా కల్తీలు

: మందు బాబుల ప్రాణలతో చేలగాటం అడుతున్న పట్టించుకోని అధికారులు

వెంకటగిరిరూరల్ ఆగస్టు 16 ప్రభాతవార్త:

ఆసలే ఆంధ్ర మద్యం అంటేనే మందు బాబులు బేంబేలేత్తుతున్నారు.అందులో కల్తీ అంటే ఎంత దారణం అని మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో అధిక శాతం వెంకటగిరి పట్టణం తోపాటు డక్కిలి మండలం పలు మద్యం షాపులల్లో నిత్య అధిక ధరలకు విక్రయించే బ్రాండ్లు లలో తక్కువ ధరలు కల్గిన చిఫ్ లిక్కర్ కలపడం దారుణం అని మందు బాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అదేమని షాపు వారిని అడిగితే నీకు ఇష్టం ఉంటే తీసుకో లేకుంటే ఎవ్వరికి చెప్పుకుంటావో అని హెచ్చరిస్తున్నారని మందు బాబులు వాపోతున్నారు.ప్రభుత్వ ఖజనాకు అధికంగా నిదులు సమకూర్చే మందు బాబులు పట్ల మద్యం షాపు నిర్వహకులు దురుసుగా ప్రవర్తించడం సరికాదని అంటున్నారు.కల్తీ మద్యం అరికట్ట వల్సి న అధికారులు పత్త లేకుండా పోవడంతో వారి ఇష్టను సారంగా మద్యం కల్తీలు చేసి మందు బాబులు ప్రాణాలతో చేలగాటం అడుతున్నారు.ఇప్పటికైన సంబందిత జిల్లా ఉన్నతాదికారులు వెంకటగిరి,డక్కిలి ప్రాంతాలల్లో షాపుల్లో జరుగుతున్న కల్తీ మద్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరతున్నారు.

